కథానిక

# గ్రామసౌభాగ్యం

నిట్టల శ్రీరామమూర్తి

రొప్పుతూ, రోజుకుంటూ, అత్తగారిలాగ చిర్రుబుర్రుమంటూ, నిప్పులు గ్రక్కుకుంటూ వచ్చింది రైలు దాన్ని చూస్తుంటే చిన్నప్పుడు మా అమ్మమ్మ అన్న మాటలు జ్ఞాపకం వచ్చేయి. "పాపం ఎంత ఆయాసపడుతోందో చూశావురా? ఎంతదూరాన్నుంచి వస్తోందో?" అంటూ జాలి పడేది. ఇంత సామానుతో బండిలో ఎల్లా పడతామా అనే దిగులు నామనస్సులో ఓవంక పీడిస్తూనేవుంది. రామంమట్టుకి చకచకా సామానులు కూలీల నెత్తికెక్కించి కంపార్టుమెంటులు ఒక్కటొక్కటీ చూసుకుంటూ బయలుదేరేడు. నేను మౌనంగా వాడి వెనకాలే నడిచాను. రైలంతా కిక్కిరిసిపోయివుంది జనంతో. నేను యిక రైలు యెక్కే యోగ్యత ఈరోజున లేదని నిరాశ చేసుకున్నాను. కాని రామంగాడి ఉత్సాహం, ఆత్మనమ్మకం చూస్తే నాకాశ్చర్యమేసింది. ఆఖరికి ఓ పెట్టిదగ్గర ఆగి "లోపలికి పోనివ్వండి" అన్నాడు మాంచి జబర్దస్తీ గొంతుకతో. గుమ్మందగ్గర నించున్నవాళ్లు మాకేసి అదోలా రామం "కొంచం చోటివ్వండీ, మనం అంతా సర్దుకు కూర్చోవాలి గాని, చోటు లేదంటే యెలా" అంటూనే లోపలికి దూది వెళ్ళిపోవటం, ఒక్కొక్క సామానే లోపలికిజారెయ్యటం జరిగింది. తప్పనిసరి కాపురం చేసే క్రొత్తకోడలి మొహంపెట్టి గుమ్మంలోని వాళ్లు సామాన్లు లోపలికి చేర్చటంలో సాయం చేసేరు. అంతవరకూ రైలుఎక్కలేక ప్లాటుఫారం మీద తిరుగుతూన్న యిద్దరు పెద్దమనుష్యులు మమ్మల్ని చూసి ''యిదే ఛాన్స్'' అనుకుని పెట్టిలోకి మా వెనకాలే ఎక్కేశారు.

లోపల బెంచీమీద గుమ్మడికాయంత ఒళ్ళూ, వెలక్కాయంత తలా కలిగిన ఒక పెద్దమనిషి బెడ్డింగు విశాలంగావేసి, పడుకున్నాడు. ఆ గంభీర విగ్రహాన్ని చూసి, నించున్నవాళ్లెవరూ సాహసించి అడగలేక పోతున్నట్లు ఆయనకేసి వారు చూసే మెత్తని కసిచూపులే చెప్తున్నాయి. "ఇంకా సాయంత్రం ఆరు కాకుండానే నిద్రయేమిటి స్వామీ, కొంచంలేవండి'' అని మావాడు నయాన్నీ భయాన్నీ బెదరించేసరికి ఆయనగారు నసుగుతూ ఏం చేయలేని కోపంతో కొంచం కాళ్లు దగ్గరగా లాక్కున్నాడు. "కూచోరా గోపీ" అని రామం కేకేయ్యగానే నేను ఆ యిరుకుస్థలంలో అనుకుని కూర్చున్నాను. ఎదుటి బెంచీమీద కిటికీవైపు ఓ పదేళ్ళ కుర్రాడు పడుకున్నాడు. పాపం వాడికి నిద్రరావటంలేదు. బలవంతాన్ని కళ్లుమూసుకు పడుకున్నాడు. మధ్యమధ్యని కళ్ళుతెరుస్తూ ఎవరేనా చూసేసరికి గబుక్కున కళ్లుమూసుకుంటూ నానాఅవస్థలు పడుతున్నాడు. ఇంక భరించలేక ఓసారి లేవబోయేసరికి వాళ్లమ్మ "వెధవా, పడుకో" అని బలవంతాన్ని వాణ్ణి ఓ మొట్టుమొట్టి పడుకోబెట్టింది.

"ఏం తమ్ముడూ, పాపం నిద్రరావటంలేదా?" అని రామం వాణ్ణి ఓదారుస్తూ లేవతీసి ప్రక్కనే చదికిలబడ్డాడు. అవతల గుమ్మందగ్గర మా వెనకాలే ఎక్కిన యిద్దరూ రోడ్డు మరామ్మత్తప్పుడు పెట్టిన పీపాల్లాగ అడ్డంగానిల్చుని క్రొత్తవాళ్లని బయటికి గదిమేస్తున్నారు వాళ్లు ఏ పరిస్థితుల్లో ఎక్కారో మర్చిపోయి.

రైలు కదిలీ కదలటంతోటే, అంతవరకూ ప్లాటుఫారంమీద, రైల్లోని ఆడాళ్ళకేసిచూస్తూ ఉల్లాసంగా తచ్చాడుతున్న యిద్దరు యువకయోధులు ప్రక్కస్టేషను సీజను టిక్కెట్టుగాళ్లు కామోసు-గబుక్కున అప్పుడేవచ్చి ఎక్కబోతున్నట్లు, మాపెట్టె పక్కనేవున్న ఆడవాళ్ళపెట్టె మెట్లమీద ఎక్కి నించున్నారు వెకిలి నవ్వులు నవ్వుతూ. "దిగుతారా, చైను లాగనా" అని రామం కిటికీలోంచి కేకెట్టేసరికి వాళ్ళు గబుక్కున ఎల్లాఎక్కారో అల్లాగేదిగిపోయారు వెకిలి నవ్వులు మానేసి. మమ్మల్ని లోపలికి రావద్దన్న ఆసామీలు రామాన్ని చూసి భయపడి మంచిచేసుకుందామనో ఏంచేతోగాని కుశలప్రశ్నలతో ప్రారంభించి క్రమంగా పరమమిత్రులైపోయారు.

రైలు కుదుపుతో లయవేసే నా ప్రక్కనున్న పెద్దమనిషి తలకాయను చూస్తూ, ఓంప్రథమ పెట్టే కొత్త రైలు యింజన్ను జ్ఞాపకం చేసుకుంటున్నాను. గాలివాలుకి ఎదురుగా కూర్చున్న ఆయన చుట్టపొగ బుర్ర పైనుంచి వెనక్కిపోయి చుట్ట నెరుసులు ఆ పొగను వెంబడిస్తూంటే రైలు యింజనుకూ ఆయనకూ అట్టే భేదం కన్పించలేదు. రామం కొరియా యుద్ధం, అభ్యుదయ కవిత్వం, త్యాగరాజ ఉత్సవాలగురించి ఓ లెక్చర్లు దంచేస్తున్నాడు. ఏ పరిస్థితుల్లో, ఏ పరిసరాల్లోవున్నా తన ఉత్సాహంతో, సంతోషంతో ఎదుటివాళ్లని నవ్వించే స్వభావం రామానిది. వాణ్ణి అభినందించి ఆనందించడమే నాపని. వాడి నవ్వుమాటలకి ఆఖరికి ఆ కుర్రాడి తల్లికూడా నవ్వింది. నా ప్రక్కనున్న "యింజను మనిషి" కొంచం సకిలించి నాకు యింకాస్త చోటిచ్చాడు. రైలు దూసుకుపోతోంది ప్రియురాలి నవ్వుచూసి ఉద్రేకంతో కొట్టుకునే ప్రియుని గుండెల చప్పుడుతో.

"తలుపు లోపలికి లాగవయ్యా"అన్న గంభీర వాక్కు, రైలంతా నాదే అన్న అధికారంతో కూడిన స్వరం వినిపించి కదిలేరైలులో ఎక్కే ఈ పెద్దమనిషి ఎవరాయని అటుచూసేను. లావుగా, పొడుగ్గా, భారీగా, బుంగమీసాలూ, నల్లనిటోపీ దాని అచులోంచి యివతలకి పీచులా రేగే ఎర్రని జుట్టూ, నొసట ఎర్రనిబొట్టూ చిన్న డబ్బాతో ప్రవేశించాడు ఆ ఆసామీ.

"ఆఁ, తేలుమందండీ తేలుమందు. ఫస్టుక్లాసైన మందు. ఎవరికిగాని,ఎప్పుడుగాని, ఎటువంటి తేలు కుట్టినా వెంటనే ఈ కణికె అరగదీసి రాయండి. ఒక్క నిమిషంలో బాధంతా ఎగిరిపోతుంది"అని మామూలు పారం చదవటం మొదలెట్టేడు. అతని గొంతులో "కొనకపోతే ఊరుకోనుసుమా" అనే హెచ్చరిక, "ఈమాత్రం కొనలేనివాడివి ఏంపని కొస్తావయ్యా"అనే హేళనా ఉన్నాయి. అతని చొక్కామీద, చెవిమీద భుజంమీద తేళ్ళు పాకుతున్నాయి. కొనకపోతే ఏం మీదపడి బలవంతాన్ని ఆ తేళ్ళచే కరిపించి ఆ కణిక రుద్దుతాడో అనే భయంచేత యిద్దరు ముగ్గురు ఎంతో నమ్మకం చూపిస్తూ అతనిదగ్గర కణికలుకొన్నారు.

ఆపైని అతను ఇంకో డబ్బాతీసి "ఆఁ, మాంచి కళ్ళమందు సార్. కళ్ళమంటలకీ, తలనొప్పులకీ ఘాటైన ఔషధం. ఒక బిళ్ల వాడిచూడండి మీకే తెలుస్తుంది" అంటూ ఒక బిళ్లతీసి బెంచీమీద కూర్చున్న నాలుగైదుగురికళ్ళకి రాసేసేడు. ఒకాయన సరదాగా రాయించుకున్నాడు. మరో పెద్దమనిషి "వద్దు వద్దంటూనే వెర్రినవ్వుతో మా మొహాలకేసి నిసహాయంగా చూస్తూనే అతగాడి చేతుల్లో లొంగిపోయాడు ఒకతనుమట్టుకు నిజంగా కళ్లు పోతాయన్న భయంచేత కాబోలు 'ససేమిరా' వద్దన్నాడు.

"అట్టే మొహమాటపడకు మిస్టర్ దీనికి డబ్బివ్వక్కర్లేదు లే" అంటూ ఆయనకళ్లకి పట్టించాడు.

"మీకుసార్, మీకుసార్, మీకు" అంటూ నా ప్రక్కనున్న ఆసామీ దగ్గరకు అతను వచ్చేసరికి ఆయన అతితెలివిగా ఓ బేడయిచ్చి బిళ్ళకొనేశాడు. ఇంక అతను నాకేసి రామం కేసీ ఎగాదిగాచూసి, కొంచం తటపటాయించి మా డ్రెస్సులను చూసి రాస్తే బాగుండదనుకున్నాడు కాబోలు చక్కాబోయాడు.

అతనూ అలా ఆ గుమ్మంలోంచి దయచేయగా "మాలీస్, మాలీస్" అనే కేక ఈ గుమ్మందగ్గర వినిపించింది. వెంటనే తగు పరికరాలతో ఓ నల్లనిసన్నని గొర్రెకాపుమనిషి చక్కావచ్చాడు. అతని క్రాపు చూస్తుంటే పాపం అతగాడికి మాలీసుచేసేవారు లేకపోయారా అని జాలివేసింది. ఆ కేక విని పోలీసేమో అనుకుని మా బల్లక్రింద పడుకున్న టిక్కట్టులేని రైల్వేగెస్టు అదిరిపడ్డాడు. ఇటూఅటూ మెదిలి ఇంకాస్త లోపలకి సర్దుకున్నాడు. మాలీసుమనిషి యెంతో సంతోషంతో, ఆప్యాయంగా, ఇన్నాళ్ళకి తన నేర్పరితనం చూపించే సావకాశం దొరికిందన్నట్టు నా ప్రక్కమనిషి "బులెట్ తలకాయను" ఎంతో ముచ్చటగాచూడ్డం మొదలెట్టేడు. వాడి వైఖరిచూస్తే, ఇంత విలువైన అపూర్వమైన తలకాయను మాలీసుచేస్తేనే చాలు జన్మ ధన్యమవుతుందన్నట్లు కనిపించాడు. వాడు వూరికే ఈ తలకాయను మాలీసుచేస్తాడన్నా ఆశ్చర్యపడవలసిన అవసరంలేదు. కాని ఆ తలకాయవున్న మనిషే మమ్మల్ని చూసి సిగ్గుపడి కామోసు మానేసేడు.

ఈలోగా అడుక్కునే ఓ పదిహేనేళ్ళ గ్రుడ్డిదీ, దాని తమ్ముడూ మా పెట్టెలోకి ప్రవేశించి "ఓ దూరెజా సెవాలే" అంటూ మొదలెట్టేరు. గ్రుడ్డిదికి దాయని కాబోలు "బులెట్ మనిషి" మహాశ్చర్యంగా ఆపిల్లకేసి చూసేస్తున్నాడు. పాటవింటూ బుర్ర తెగవూపేశాడు పోలీసుమనిషి సమీపంలోనే ఉన్నాడనే భయమేనా లేకుండా. అంతగా ఆనందించిన మనిషే పాపం ఆపిల్లకి కానీయిచ్చిన పాపాన్ని పోలేదు.

ఇంతలో "వచ్చేశాంరా మనవూరు" అని రామం అనటం, స్టేషనురావటం మేముదిగిపోటం ఒక్కక్షణంలో జరిగిపోయింది. రామం బండి మాట్లాడు తున్నాడు. నేను కదిలిపోయే రైలు కిటికీలోంచికనిపించే నా బులెట్ నేస్తం యింజన్ తలకాయను చూస్తూ వుండిపోయాను.

మేం ఎక్కినజట్కా చురుగ్గాసాగిపోతోంది. జట్కాసాయిబు బీడీపొగ రోడ్డుమీద ఎగిరే దుమ్ముని తరుముతోంది. కళ్ళానికి కట్టిన చేంతాడు పగ్గాలు తెగుతాయేమో అని భయంవేసే స్పీడుతో గుర్రం పరుగెత్తుతోంది. నా కెదురుగుండా గూడుకువున్న అద్దంలో (అద్దంఅనటంకంటే గాజు పెంకు అంటే బాగుంటుందేమో) అలుముకుపోయి అయిమూలగావచ్చి సర్రియలిస్టు కలలా కనిపించే నామొహం చూసుకునేసరికి మిగతా గూడులోని అద్దాల చట్రాలు అద్దాలు లేకుండా యెందుకు వున్నాయో అర్థమైంది. క్రిందసామన్లు వున్న చేంతాడు చిక్కం యిటూ అటూ వూగుతోంది. ఎటు చూసినా పచ్చనిచేలు, ఆపైని ఒయ్యారంగా నిలిచే కొండలు. పక్షుల కిలకిలధ్వనులూ——ఉన్నట్టుండి ఒక్కరి కొండ శిఖరానికి ఎక్కిపోయి క్రిందిపరిసరాల్ని చూడాలనే ఉత్సాహం కలిగింది. పైన వినీలాకాశంలో చెదరుగా ఎగురుతున్నాయి మేఘాలు.

జట్కావాడు తన సుంద్రని సన్నని చిల్లుల బనీను ముందువైపు అడుగున లోపలవైపున్న జేబు తడిమి అగ్గిపెట్టి కనిపించక సగంకాలి ఆరిన బీడీని చెవిసందులోకిదోపి ఈలవేసుకుంటూ బండి చక్రం కమ్మల్ని కమ్చీతోకొట్టి చప్పుడుచేస్తూ తనధోరణిలో తనువున్నాడు. మేం నెమ్మదిగా రోడ్డుఎత్తు ఎక్కుతున్నాం. ఆ ఎత్తుమీంచి ఓ పాలమ్మి అలవాటుమీద అనిపించకో లేక ఆమాయకత్వంతోనో, నెత్తిమీద తట్టతో బరువెక్కి విస్సాటంగా త్రిప్పుకుంటూ వస్తోంది.

రామం ఆమాయకంగా తను చిన్నప్పుడు తిరిగిన తోటలూ, దొంగతనంగాఎక్కిన మామిడిచెట్లూ అన్నీ జ్ఞాపకంతెచ్చుకుంటూ నాకుచూపిస్తున్నాడు. ఆ స్థల పురాణాలు వివరించి చెప్తున్నాడు. వీళ్ళని చూస్తుంటే నాకనిపించింది ప్రకృతిలో లీనమై ప్రకృతి బిడ్డలాగ ప్రకృతిసీమలో తిరిగేవారికి ప్రకృతిసౌందర్యాన్ని ప్రత్యేకంగా ఊహించుకోవటంఉండదని తల్లి సౌందర్యం బిడ్డకి తెలియనట్లు.

దూరాన్ని రెండు పర్వతాలు ఒకదాన్నొకటి అనుసంధించి ఆకాశంకేసి నిక్కి చూస్తున్నాయి. వాటి చరియలమీద మేఘపు నీడలుపడుతున్నయి

కనిపించే గుడిసెల్ని దాటి, ఓప్రక్క సైకిలు షాపూ, పిల్లల కాఫీహోటలూ, కిళ్ళీకొట్టూ, ప్రక్కనే మంగలిషాపున్న బల్లచెక్కల గది, దానిముందున్న ఒకపెద్దమనిషికి క్షవరం చేస్తున్నట్లు కనిపించే మంగలీ వాడి క్లయింటువున్న బొమ్మ (ఆ బొమ్మనుచూస్తే రవివర్మాదులు ఆత్మహత్య చేసుకుంటారు. సర్రియలిస్టులు సలాము కొట్టారు) రెండోవైపు కోమటికొట్టూ, జట్కాస్టాండు,దాటిగుడికో నేరుప్రక్కగా వూరిమెయిన్ రోడ్డుకి తిరిగేం. మాబండిచప్పుడికి కోళ్ళు రోడ్డు మీంచి యిటూ అటూ ఎగిరేయి. రోడ్డుకిమధ్యగా పడుకున్న కుక్కలనాయకుడు తాపీగాలేచి తోక జాడించి ప్రక్కకి తప్పుకున్నాడు. రోడ్డుప్రక్క మట్టిలోపడి అడుకొనే బోసిమొల పిల్లలూ గోలీలు ఆడుతునే పసులకాపర్లూ తలెత్తిమాకేసి కుతూహలంగా చూసేరు. నూతిదగ్గర ఆడపడుచులు చోద్యంగా ఎవరాయని చూడ్డం మొదలెట్టేరు. రామంనాన్నకాబోలు మట్టి అరుగుమీద కర్ర పేంకుర్చీలో తీరుబడిగా కూర్చుని చుట్ట కాలుస్తున్నారు. ప్రశాంతంగా నిశ్శబ్దంగావున్న వాతావరణంలో చీకూచింతా లేకుండా, పడకకుర్చీలో సుఖంగా జేర్లబడి, చుట్టకాలుస్తూ ప్రపంచంలో జరిగే గందరగోళాలలో నిమిత్తంలేకుండా వున్న ఆయన్ని చూస్తుంటే, పరీక్షప్యాసవుతామో లేదోయనే కంగారుతో మనస్థిమితం లేకుండా రాత్రింబగళ్లు తెగచదివే విద్యార్థులూ, నిత్యం పొట్ట కోసం తాపత్రయపడుతూ ఏరోజు కారోజే జీవితం గండంగా గడిపే కూలీలూ, కవులూ,సుమా

స్త్రాలూ, హడావిడిగా ఇటూ అటూ తిరిగే ప్రజలూ గల పట్టణవాసంలోంచి వచ్చిన నాకు కొంచెం అసూయకలిగిందంటే ఆశ్చర్యంలేదు. రెండో అరుగుమీద తాటాకులచాపమీద మరో యిద్దరు కూర్చుని పుగాకుచుట్టలు చుడుతూ ఏవో కబుర్లు చెప్పుకుంటున్నారు. ఇంటిముందున్న కొబ్బరిచెట్ల ఆకుల సందుల్లోంచి సూర్యరశ్మి అరుగులమీదా, గోడలమీదా అక్కడక్కడ మచ్చలుగా పడుతోంది. తాటాకు పైకప్పుకి పడమటి వైపు వంటింటితాలూకు పొగ పైకి లేస్తోంది. ప్రక్కనే స్కూల్‌మాస్టర్-కమ్-పోస్టుమాస్టరుగారు బెత్తం ఆడిస్తూ లెక్కలు చెప్తున్నారు. కుర్రాళ్ళ దృష్టిమట్టుకు మామీదా, మేమువచ్చిన బండిమీదావుంది. ఒకరిద్దరు సాహసులు మాదగ్గరకే వచ్చేసేరు ఉండబట్టలేక.

"నా ప్రాణస్నేహితుడు క్లాస్‌మేట్ గోపాలరావునాన్నా, సెలవులకి మనవూరు చూపిద్దామని తీసుకొచ్చాను" అని నన్ను పరిచయం చేసేడు రామం.

నోట్లోవున్న చుట్ట యివతలకితీసి, కాండ్రించి ఉమ్మేసి, నవ్వుమొహంతో "లోపలికి దయచేయండి" అంటూ ఆయన నన్ను ఆహ్వానించారు.

"అప్పిగా వేన్నీళ్ల సిద్ధంచేయరా" అని కేకేసి ఆయన నన్ను కబుర్లలోకి దింపారు.

భోజనాలవుతున్నాయి.

"అదేమిటే అమ్మా, కమ్మని పెరుగు మానేసి మజ్జిగ వడ్డిస్తున్నావు" అన్నాడు రామం.

"ఈ మధ్య మన గేదె చచ్చిపోయింది. అప్పట్నించీ పాలు కొంటున్నాం" అంది ఆమె.

"మనవూళ్ళో మంచిపాలు దొరికేవికదూ. సుబ్బి పోయటంలా?" అన్నాడు రామం.

"ఆ, అదే పోస్తోంది. ఇప్పుడు వాళ్ళూ తెలివి మీరేరు. ఊళ్ళో పాలన్నీ లాంచీమీదా, సైకిళ్ళమీదా పట్నానికి పోతున్నాయి కాఫీ హోటేళ్ళకి. మనకి వాళ్ళ పాతే" అన్నారు వెంకయ్యగారు (అంటే రామం నాన్నగారు).

"పూర్వం పల్లెటూళ్లటండీ. యిప్పుడు పాలు మజ్జిగలకి కరువూ, పట్నంలోకంటే హెచ్చు రేట్లూ. అంతెందుకు విస్సన్నగారి కామన్న వున్నాడే అతగాడి మామిడితోటలోని పళ్లన్నీ ఊళ్ళో అందరికీ ఊరికే సమృద్ధిగా పంచి పెట్టేవాడు తను హాయిగాతిని, ఇప్పుడు ఆ తోటలోని పళ్లన్నీ పట్నానికే రవాణా. డబ్బిచ్చి కొందామన్నా యిక్కడ మంచివి దొరకవు అల్లాగే ప్రతీవాళ్ళునూ. ఈ విషయంలో ఈ రోజుల్లో పట్నాలే నయం. డబ్బిస్తే శుభ్రమైనవి అన్ని రకాలూ దొరుకుతవి" అన్నారు. వెంకయ్యగారి వేలువిడిచిన మేనమామగారి కుమారుడు రాఘవులుగారు మీసాలు తుడుచుకుంటూ.

"వ్యాపారం జరిగితే మంచిదే కదండీ. పూర్వం కంటే యిప్పుడు రోడ్లు, రైళ్లు, కాలవలు, అన్ని రకాల రహదార్లూ ఏర్పడ్డంమూలాన్ని అన్ని వూళ్లతో పరిచయం కలగటం, పదిమందితో వ్యాపారం చెయ్యటం జరుగుతోంది" అన్నాను.

"అవునవుకోరా గోపీ, అయితేమట్టుకు మనకు కావల్సింది వుంచుకుని ఆపైన అమ్ముకోవాలి గాని ఉన్నదంతా వూడ్చిపెట్టి అమ్మేస్తే ఇంక మనకి సౌఖ్యం ఏమిటి చెప్పు" అన్నాడు రామం. ఇంతలో వెంకయ్యగారు చెంబుడు నీరుత్రాగి జిర్రుమని తేన్చగానే మాకు పీటలమీంచి లేవటానికి సిగ్నలైంది.

మేం అరుగుమీదచేరి తాంబూలం వేసుకుంటున్నాం. రాఘవులుగారు భుక్తాయాసం తీర్చుకుందుకు చాపమీద నడుంవాల్చి విశ్రమించారు. ఆయనగారు మాటల హడావిడిలో మామూలు కంటే ఓ మోతాదు ఎక్కువగా ఆహారం సేవించినట్లు కనిపించింది. ఎదురుయింటి అరుగుమీద పేకాట వేసేరు వూరిలోని కొందరు యువకులూ, వృద్ధులూ.

"వాళ్లకేంరా తిండానికి తగిన కొండవుంది. పొలం పనులు రైతులు చూసుకుంటారు. వాళ్ళకిదే కాలక్షేపం" అన్నాడు రామం. నా మొహంలోని ప్రశ్న సూచనకు సమాధానంగా.

"మరి పిల్లలు పుట్టుకొస్తున్న కొద్దీ భూమి పెరుగుతుందట్రా క్రమంగా చీలికలై పోటంతప్ప. అప్పుడేనా భుక్తికి వాళ్ళు త్రోవ చూసుకోవల్సిందేనా? ఇప్పటినుంచీ జాగ్రత్తపడటం మంచిది కదూ" అన్నాను.

ఈలోగా ప్రక్క స్కూలులో ఆటవిడుపుకి బెల్ కొట్టేరు. కుర్రాళ్ళు ఆడుతూ గెంతుతూ చెదిరిపోయారు. మేష్టరుగారు పేకాట ఆడే చోటుకివెళ్ళి బెత్తం రెండుచేతుల్తో నడుంకు చేర్చి

పట్టుకుని వెనక్కి విరగబడుతూ ఒకాయనకు ఫలానా ముక్క వెయ్యమంటూ తమ Expert సలహా యిస్తున్నారు.

పేకాడే యింటికి ప్రక్కనున్న యింట్లో రామాయణం పారాయణం ఘాటుగా వినిపిస్తోంది. సన్నగా వెదురుబద్దలాంటి పొడుగైన మనిషి— వంగిన నడుమూ, ముడతలుపడ్డ కడుపూ, సోడా కాయలాంటి పొడుగాటి మొహం, ఇంగ్లిషురాజు ఛార్లెసు క్రాఫులాంటి పొడుగాటి భుజంమీదకు పడే జుత్తూ, సన్నని పొడుగాటి ముక్కూ, చెవులకి కమలాలూ, ఎర్రటి పంచకట్టూ- "ఎవరోయ్ ఈ మహాభక్తుడు" అన్నాను.

"ఆయనే బాపనయ్యగారు. మాంచి లేఖరి. లిటిగేషనులో ఈ చుట్టుప్రక్కలకి అల్లాంటి మనిషి లేడు. అస్తమానూ ఎవరో ఒకరు సలహా కోసం ఆయనదగ్గరకు వస్తూనే వుంటారు. ఆయనంటే ప్లీడర్లకీ భయమే ఓవిధంగా. ఆయనవల్ల కొంపలు కూలినవారు పైకేమీ అనలేకపోయినా లోపల తిట్టుకుంటారు. ఉపకారం పొందినవారు మద్దతుగా వుంటారు" అని ఆయన జీవిత చరిత్ర టూకీగా చెప్పేశాడు రామం.

"అప్పుడే ఏంచూశారు ఆయన పస. రాత్రి అవనీండి భజన్లతో వీధివీధంతా గగ్గోలెత్తిం చేస్తాడు" అంటూ ఈ ఘట్టం పూర్తిచేసేరు రాఘవులుగారు. మేము పొలాలకేసి షికారు వెళ్లివస్తామంటూ బయలుదేరేం.

ఎటుచూసినా మత్తేభాల్లాంటిపర్వతాల దొంతరలు. మధ్య పచ్చని చేలు. దూరంగా మసక చీకట్లో కొండవాలులో మేస్తూన్న తెల్లని గొర్రెల మందచరచర క్రిందికిదిగిపోయింది. త్రాచుపాములా మెలికలుతిరిగిన రోడ్డుమీదుగా కొండల్లోకి ఇంటి మొహంపట్టే బండెద్దుల మెడలో గంటల గలగలా దానికి తాళంవేస్తూ కొండ చరియల్లోంచి బయలులోకి వేగంగా ప్రవహించే సెలయేటి జలజలా, సెలయేటిమధ్యలో నల్లని బండరాయిపై ఒకటి కాలిపై ధ్యానంచేసే కొంగఏకాగ్రతా రామాన్ని కూడా పరవశుణ్ణి చేసేయి.

"నేనే చిత్రకారుణ్ణి అయితే యీ పళంగా లేండ్ స్కేపు గీసేద్దునురా" అంటున్నాడు రామం.

ఈలోగా కెవ్వుమని కేకా, తిట్లూ, కొట్టుకోవటం కనిపించేయి. దూరంగా వుండటంమూలాన్ని సైలెంటుసినిమాలోలాగ వాళ్ల చేతలు కనిపిస్తున్నాయి. చేలో పెదకాపు మునయ్యా, పెత్తందారు చెంచ్రాయుడూ దెబ్బలాడుకొంటూన్నారు. (వివరాలు ఊళ్ళో తెలిశాయి) నీటి వంతుల్లో తగాయిదా. వేళాకోళంగా ప్రారంభమయి చిలికిచిలికి గాలివానైంది. ఇటు పదిమందీ అటు పదిమందీచేరి కర్రల్తో బాదుకున్నారు. ఒకరిద్దరు గాయాల్తో నెత్తురుగ్రక్కుతూ పడిపోయారు. మిగతావాళ్లు ఎవరితిన్నవాళ్లు పరుగు తీసేరు.

క్షణంలో రమ్యమైన ప్రకృతిసీమ రక్తరంజితమైపోయింది. ప్రశాంత వాతావరణం భీభత్స ప్రళయంగా మారింది. జలజలానడిచే అమాయకపు సెలయేరూ గంభీరంగా నిలిచే కొండలదొంతరలూ మౌనంగా చూస్తూనేవున్నాయి తాము ఇదివరకే చూసేం ఇలాంటిసంఘటనలు ఎన్నో అనే సర్వజ్ఞతతో, "ఏమిటి ఈ వైరుధ్యం?" అన్న రామం ప్రశ్న అలాగే నిలిచిపోయింది.

మేము వూరికి వచ్చినరోజున రామం యింటి అరుగుమీద కూర్చున్న యిద్దరూ మునెయ్యా, చెంచ్రాయుడూనూ. ఆ రోజున వాళ్లిద్దరూ ఎంతో అమాయికంగా, అజ్ఞానంగా పట్టణం కబుర్లన్నీ మమ్మల్ని అడిగి తెలుసుకుంటూ యెన్నో కబుర్లుచెప్పేరు. వాళ్ళ అమాయకత్వంలో ఇంత పశుత్వం ఇమిడివుందనీ, వాళ్ళ అజ్ఞానంలో ఇంత కపటం వుందనీ ఎలా వూహించుకోగలం?

మేమువూళ్ళోకివెళ్ళేసరికి నానా గొడవగామా వుంది. ప్రతివాళ్ళూ గుసగుసలుగా ఈ విషయమే చర్చిస్తున్నారు. హత్యకేసువస్తే లాయరు యెంత సంతోషిస్తాడో, పెద్ద ఆపరేషను చేయబోయే డాక్టరు ఎంత ఉత్సాహం చూపిస్తాడో—ఇద్దరూ వృత్తిరీత్యా— అంత ఆనందం అనుభవిస్తున్నారు. రోజూ రాత్రిళ్లు పనీపాటా లేకుండా వూళ్ళో కాలక్షేపం అవక పోస్టుమాష్టరుగారింటి అరుగు మీద తిష్టవేసి కబుర్లుచెప్పుకునే నిక్షేపరాయుళ్లు ఉబుసుపోడానికి తగినవిషయం దొరికిందని, పైకి మాత్రం సీరియస్ మొహాలుపెడ్తూ. ఆడవాళ్ళకి భయంవేసింది ముందు ఏమవుతుందో అని. ప్రతీ దానికీ సాక్ష్యం యివ్వడానికి తయారుగావుండే పెద్దమనుష్యులకి హుషారుగావుంది కోర్టు ప్రయా

కాలూ, టిఫిన్లూ, భోజనాలూ సినీమాలు తగుల్తాయని. రాత్రి బాపనయ్య అరుగుమీద చాలా మంది జనం వేచియుండేవారు. రోజురోజుకీ బాపనయ్యగారి భజనల హోరు తీవ్రమయేది. వూరు రెండు పార్టీలైపోయింది. ఛార్జీలూ, కవుంటరు ఛార్జీలూ దాఖలయ్యాయి.

ఈలోగా చెంచ్రాయడు భూమి ఆక్రమణ దావా తెచ్చాడు మునెయ్య పినతండ్రి కొడుకుపైన. రాయడి అన్నకూతుర్ని ఇంట్లోంచి గెంటేసేడు మునెయ్య మేనమామ కొడుకు. ఈ వేడిలో వీళ్లందరి ధర్మమా అని జట్కా వాళ్ళకి యింతో అంతో ముట్టింది. గ్రామస్థులంతా కలిసి వేద్దామనుకున్న రోడ్డుస్కీము వెనకబడింది.

మా సెలవులు అయిపోయాయి. మేం తిరుగు మొహం పట్టాం. దారిపొడుగునా రామం హుషారుగా కబుర్లు చెప్పేస్తున్నాడు. ముందు జట్కా సాయిబు బీడీపొగా, వెనక, మేము వదిలివేసిన ధూళీ, దూరాన్ని గంభీరపర్వత పంక్తుల్లోంచి వినవచ్చే సెలయేటి రాగాలాపనా,—ప్రకృతి మమ్మల్ని వెక్కిరిస్తున్నట్లు అనిపించింది.

---

స్కెచ్

# పసివృద్ధు సుందరం

ఆర్. యం. చిదంబరం

తల్లి కేకలువిని నిద్రనుండి మేల్కొన్నాడు సుందరం. నిద్ర అసలు చాలకుండా ఆరోగ్యం క్షీణించిపోతున్నా యథాప్రకారంగా తల్లి నాలుగు గంటలకు లేపటం మానటంలేదు. సుందరానికి చిర్రెత్తింది. ఆ యిల్లొక నరకంగా, ఆ యింట్లో తనవారన్న పేరుతో మసలే ఆడామగా యమకింకరుల్లా కనిపించారు. "అబ్బా! రోజూ చంపుతారెందుకే? అయినా సెలవల్లో కూడా ఈ చదువేనా? క్షణం నిద్రపోనీరు. కళ్లు మండిపోతున్నాయి" అనరిచాడు కోపంగా సుందరం.

"ఏడిశావ్! వెధవా! లే! సినిమాలకు, షికార్లకు తిరగమంటే తిరుగుతావు. చదువంటే బద్ధకం. నీకేమిటి? ఈ కాలపువాళ్ళందరికీ ఇదే బాధ - చదవకపోతే పరీక్షపట మెలాగు? సెలవలు చదువుకుందుకిచ్చారుగాని కుంభకర్ణుడిలా నిద్రపోవటానికికాదు. లే-అనవసరంగా వాగిందావంటే వీపు చిట్లిపోతుంది."

"నాలుగింటికి అలారం పెట్టమంటే కొడుకు మీద ప్రేమతో అలారం పెట్టడం మానేసింది, మా అందరికీ లేని ఉపకారబుద్ధి కరుణ ఈ తల్లికి వచ్చాయి"అని తరుణాన్ని సక్రమంగా ఉపయోగించుకుంది మామ్మ.

ఇక లేవకపోతే బ్రహ్మాస్త్రం ప్రయోగించబడుతుందని పెరట్లోకి పరుగెత్తాడు. చీకటి బాగా ముసురుకొనుంది. చెట్లన్నీ నిశ్చలంగా నిలుచున్నాయి. మొహం కడుకుంటూ యోచింపసాగాడు. నిరంతరం తననిలాగ "చదువు. చదువ"ని పీక్కుతింటూనేవున్నారు. ఇలా అఘోరిస్తూంటే కొంతకాలానికి పిచ్చాసుపత్రిని పవిత్రంచేయవలసి వస్తుంది. అతని స్కూల్లో బి.ఏ. ప్యాసైన మేష్టారొకరున్నారు. ఆయనచదువు సంద్రంలో మునిగితే సంద్రంలోని విషజంతువులు మెదడంతా తినేసి వాటిస్థానే మొదటిరకం మట్టిని దిగుమతి చేయటం వలన ఆయన పిచ్చివాడైపోయాడు. రాత్రి పది గంటలదాకా యమకింకరుల్లా దగ్గరుండి చదివిస్తారు. తలిదండ్రులు తమ పనులకు సగం దృష్టినీ తక్కిన సగం పాలును సుందరం కళ్లు అక్షరాల మీద ఉండేందు రిజర్వు చేసుకున్నారు. ఇక మామ్మకు ఇతరపనులు లేవుగా! రాత్రంతా వెధవ కలలు. "చదువు-చదువు-చదువు"

అతను సినిమాలకు, షికార్లకు పోతున్నాడట! సినిమాకుపోయి రెండునెలలయింది. రెండునెలల క్రితమైనా తలిదండ్రులు వెళుతుంటే వద్దనివారించినా వినకుండా వారిని వెంబడించాడు. ఆ రామనాథంవారానికో సినిమాచూస్తాడు. అతనెప్పుడూ చదివినట్టే కనిపించడు. అతనెప్పుడూ సంతోషంగా ఉంటాడు. అనేక విషయాలు చర్చిస్తాడు

కాని సుందరం? అతను నిరంతరం క్లాసుపుస్తకాలు చదువుతాడు. లోక వ్యవహారాలేమీ అతనికి తెలియవు. పోనీ, అతనికేమన్నా రామనాథానికంటె ఎక్కువ మార్కులు వచ్చాయా? చదువులోకూడా వాడిదే పైచేయి. సుందరం